# 'ఏ వయసుకా...'

మొన్నను మా సోముగాడి కూతురు సంధ్యకు పెళ్లిచూపులు జరిగాయి.

దాన్నికప్పుడే ఇరవైమూడేళ్లు నిండిపోయాయనుకుంటే ఆశ్చర్యమేస్తుంది. మొన్ననే పోస్ట్‌గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిందది.

ఏ వయసు ముచ్చట ఆ వయసులోనే అని పెద్దలంటారు. దీనికిక పెళ్లి చేసేద్దాం అని సోము వాళ్లన్నయ్య.

ఏ వయసు ముచ్చట ఆ వయసులో అన్నప్పుడు నాకు శేషేంద్ర వ్యాసం 'సాహిత్య కళ' గుర్తొచ్చింది.

కవి కూడా వయసుకు తగినట్టుగానే స్పందించాలని అంటారు శేషేంద్ర. లేకపోతే కవిత్వంలో కృత్రిమత్వం చోటుచేసుకుంటుందని ఆయన అభిప్రాయం.

ఇలా సాగుతుంది ఆయన వ్యాసం.

"ప్రేమ మనిషి జీవితంలోకి వసంతంలా ప్రవేశిస్తుంది. ఇనుపతీగల్లాంటి నరాల్ని వికసిత పుష్ప హృదయాల్లో వుండే కింజల్కాల్లా మారుస్తుంది. భావాలకు పరిమళం అద్దుతుంది. గుండెని పల్లబుట్టలా చేస్తుంది. లోకం లోకమంతా కళ్లకు ఓ నూతనావతారం లా సాక్షాత్కరిస్తుంది. చెట్లు చేతలూపుతూ పిలుస్తాయి నిన్ను చూసి. ఆకాశాలు మత్తెక్కి ఒళ్లు విరుస్తూ ఆవులిస్తాయి. ఎగిరిపోతున్న పక్షులు దిగంతాల ఆవలి లోకాన్ని చిత్రిస్తాయి. ఉదయాస్తమయాలు రంగులద్దే వస్తుజాలంలో హృదయం స్నానం చేస్తుంది. మీ గొంతు చెట్లకొమ్మల నిండా పూలజ్వాలలు అంటించాలని ఆక్రోశిస్తుంది. లోకం లోకమే మారి పోతుంది. ఓహ్ ప్రేమ మనిషికి ఒక్కసారే ఇవ్వబడిన వరప్రసాదం. మూర్ఖుడే దాన్ని కోల్పోతాడు. జీవితానికి హరిద్వర్ణ శూన్యాన్ని పులుముకుంటాడు.

ఏ రుతువు దేన్ని ప్రసాదం చేస్తుందో, ఆ పూలనీ, ఆ ఫలాలనీ మనిషి అనుభవించాలి. గుమ్మం దగ్గరకొచ్చి నిన్ను సంబోధించిన రుతువును తృణీకరిస్తే అది మళ్ళీ తిరిగిరాదు. జీవితాంతం అనుభవించాల్సిన నష్టమది.

అరవైఏళ్ల వయస్సులో మనిషి తన పాతికేళ్ల వయసులో గుమ్మం తొక్కిన చిత్రాన్ని చిత్రించలేదు. చిత్రించినా ఆ చిత్రంలో ఆనాటి ఉద్రిక్త రక్తమాంసాల తాజా ఒంపుసొంపు

లుండవు. కవి వాస్తవానుభూతుల్ని దాచిపెట్టి తన అనుభూతులు కాని కృత్రిమ ఆలోచనలకు తన అక్షర శిశువులను బలి చేయకూడదు."

– గుంటూరు శేషేంద్రశర్మ (సాహిత్యదర్శిని)

అదండీ ఆయన అనుభవపూర్వకంగా చెప్పిన మాట.

ఫ్రాయిడ్ ప్రకారం Thought process is controlled by physical chemistry.

మన శరీరంలో జరిగే వివిధరసాయనిక ప్రక్రియల ద్వారా ఆలోచనా వ్యవస్థ నియంత్రితమవుతుంది. ఇది శాస్త్రీయంగా రుజువు అయినా కాకపోయినా చాలామటుకు నిజమే అనిపించదా?

శేషేంద్ర అన్నట్టు పైలాపచ్చీసు వయసులోని అనుభూతుల్ని యాభై అరవై ఏళ్ల వాళ్లు మసక జ్ఞాపకాలగానే చెప్పగల్రు. అంతే అప్పుడున్న వాడీ వేడీ చచ్చినా ఉండవు.

* * *

ఏ వయసుకా వయసు ముచ్చట ఆలోచనకేనా ఆహార్యానికి కూడానా?!

మొన్న కడుతూన్న ఇంటిముందు ఇసుకలో కుర్చీ వేసుక్కూర్చుని పనివాళ్ల పని చెడగొడుతూ వున్నప్పుడు, మిత్రుడు వెంకటకృష్ణ తన కూతురుతో వచ్చాడు ఇల్లెంతవరకూ వచ్చిందోనని చూట్టానికి. అతనూ మొన్ననే ఇల్లు కట్టాడు మా ఇంటికి చేరువలో.

ఇల్లు కట్టడంలో ఇబ్బందులు గురించి మాట్లాడుకుంటూండగా మధ్య అతని కూతురు "తాతా! ఇదెందుకిట్లావుందే?" అని నన్నడిగింది, ఇంకా ఫినిష్కాని గోడ భాగాన్ని చూపించి.

ఒక్కసారి నన్ను నేను చూసుకున్నాను. ప్యాంటూ టీ షర్టూ వేసుకొని శుభ్రంగా నెరసిన తలకి బాగా డై పట్టించీ...

ఎన్ని రంగులేసి ఎంత కుర్ర డ్రెస్సులేసినా ఏభై ఏళ్లు ఏభై ఏళ్లే కదా! ఇంతకీ ముసలి కవులు ప్రేమ గీతాలెట్లా రాయగలరో?! ●